క్లుప్తంగా

గొడవర్రులో పొలంబడి కార్యక్రమం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని గొడవర్రులో రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ అధికారిణి పి.శిరీష ముందుగా వరి పొలాలను పరిశీలించి, ఆకు ముడత, రెక్కల పురుగు(చిలక)ను పంటలో గమనించి రైతులతో మాట్లాడుతూ వరి పైరులో కలుపు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వేప నూనె లేదా వేప గింజల కషాయాన్ని పంటపై పిచికారీ చేసుకోవాలని దీనివల్ల రెక్కల పురుగు గుడ్లు పగలకుండా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి రమేష్, వీఏఏ పవన్ పాల్గొన్నారు.

గుండ్రటి చేతిరాతపై శిక్షణ



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నాలుగు రోజులుగా విద్యార్థులకు కాలిగ్రాఫి(గుండ్రటి చేతిరాత)పై ఇస్తున్న శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సిస్టర్ కొమ్మారెడ్డి నిర్మలామేరి మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన సుహస్త హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో కాలిగ్రాఫి శిక్షకులు సుభాష్, నవీన్ 700 మంది విద్యార్థులకు చేతిరాత, కలిపిరాత వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారని చెప్పారు. దీనిద్వారా విద్యార్థులు మంచిమార్కులు సాధించగలుగుతారన్నారు. అనంతరం విద్యార్థులు శిక్షణలో రాసిన పలు అంశాలను పరిశీలించారు.

విద్యుత్ శాఖ నుంచి సహాయం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలో ఇప్పటంలో కల్లుగీత కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆ కుటుంబానికి విద్యుత్ శాఖ నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. డీఈ అక్కల సత్యనారాయణ మాట్లాడుతూ 28 మార్చి, 2024వ తేదీన కల్లుగీత కార్మికుడు మోర్ల వెంకటేశ్వరరావు(44) తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ షాక్‌తగిలి కిందపడి మృతి చెందాడని చెప్పారు. మంత్రి నారా లోకేష్ సూచన మేరకు ఏపీసీపీడీసీఎల్ సంస్థ తరపున మోర్ల వెంకటేశ్వరరావు భార్య మోర్ల లక్ష్మి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేశామని, అందుకు సంబంధించిన పత్రాలను ఆమెకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఉండవల్లి- అమరావతి రోడ్డులో పూడిక తీత పనులు



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు కమిషనర్ అలీంబాషా ప్రణాళిక సిద్ధం చేసి ప్రతి ప్రాంతంలోను పూడిక తీత పనులు ప్రారంభించారు. దానిలో భాగంగా మంగళవారం ఉండవల్లి సెంటర్ అమరావతి ప్రధాన రహదారిలో ఉన్న డ్రైన్ పూడిక తీత పనులు ప్రారంభించారు. రెండు రోజుల ఈ పూడిక తీత పనులు కొనసాగుతాయి.

అన్ని వర్గాలను బీజేపీ వైపు ఆకర్షితులను చేయడమే లక్ష్యం



పాములపాడు(తాడికొండ): అన్ని వర్గాలను బీజేపీ వైపు ఆకర్షితులను చేయడమే లక్ష్యంగా ఏపీలో బీజేపీ పనిచేస్తుందని ఆ పార్టీ తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య అన్నారు. తాడికొండ మండలం పాములపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఎస్సీ మోర్చా, ఓబీసీ మోర్చా సమావేశానికి హాజరయ్యారు. తాడికొండ మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడుగా ఎం. కృష్ణారావు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడుగా సీహెచ్ నాంచారయ్యలను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో తాడికొండ మండల మోర్చా అధ్యక్షుడు మంచికలపూడి గంగాధరరావు, మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ బిలాల్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గుంటుపల్లి కృష్ణ, అంబటి శివయ్య, సాంబశివరావు, ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు పకడ్బందీ చర్యలు



డ్రోన్లను పరిశీలిస్తున్న కమిషనర్ అలీంబాషా, డ్రోన్లు



దోమల నివారణ ర్యాలీలో పాల్గొన్న అధికారులు

- కార్పొరేషన్ కమిషనర్ అలీంబాషా
- డ్రోన్లతో నివారణ మందు పిచికారి

మంగళగిరి: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దోమలు నివారణకు వినూత్న పద్ధతులు అవలంబిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ అలీంబాషా తెలిపారు. దోమల నియంత్రణకు వినియోగిస్తున్న డ్రోన్లను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాడుబడిన బావులు, నీటి కుంటలు, మురుగు కాలువలలో దోమల నివారణకు డ్రోన్ల ద్వారా మందు పిచికారి చేయడం ద్వారా దోమలను నియంత్రించవచ్చని డ్రోన్లను వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ

ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మలేరియా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి నుంచి పురవీధులలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నివారణకు నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మురుగు కాలువలు పాడు బడిన బావులు నీటి నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమలు నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి లోకేష్‌కు వినతి



మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మంత్రి నారా లోకేష్‌కు ఆంధ్రప్రదేశ్‌రజక వృత్తిదారుల సంఘం నాయకులు వినతిపత్రం మంగళవారం అందజేశారు. స్థానిక ఉండవల్లి అమరావతి కట్ట వెంబడి ఉన్న మంత్రి నివాసం వద్ద ప్రజాదర్బార్‌లో సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఇప్పటికి రజకులపై సామాజిక దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, సాంఘిక గ్రామ బహిష్కరణలు జరగడం, రజక మహిళలపై లైంగిక దాడులు కొనసాగడం దారుణమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, కూటమి ప్రభుత్వ ఎన్నికల ప్రణాళిక వాగ్దానంలో పేర్కొన్న విధంగా ప్రతి బీసీ తరగతుల వారికి రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని విన్నవించారు. 50 ఏళ్ల దాటిన ప్రతి వృత్తిదారునికి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కోశాధికారి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బొజ్జ సుబ్బారావు, మంగళగిరి – తాడేపల్లి నగర రజక వృత్తిదారుల సంఘం గౌరవ అధ్యక్షులు మోర్తోట సుబ్బారావు, వల్లభాపురం శంకరరావు ఉన్నారు.

విద్యార్థుల మానవహారం



మంగళగిరి సెంటర్‌లో మానవ హారంగా ఏర్పడిన విద్యార్థులు

మంగళగిరి: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడుని కఠినంగా శిక్షించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. మంగళవారం నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మల కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ కోల్‌కతాలో వైద్య విద్యార్థిని జరిగిన దాడి అమానుషమన్నారు, నిందితుడులో పాటు అతనికి సహకరించిన వారందరిని కఠినంగా శిక్షించి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలన్నారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

మంగళగిరి: 2018లో మంగళగిరిలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో నిందితుడిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కడపకు చెందిన బ్రహ్మయ్య రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడుగా ఉన్నాడు. కేసు కోర్టులో నడుస్తుండగా కోర్టుకు హాజరుకాకుండా పరారీలో ఉన్నాడు. కోర్టు నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేయగా మంగళవారం కడపలో ఉన్న నిందితుడు బ్రహ్మయ్యను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది.

నాగభూషణం, నరసింహారావులకు ఘన నివాళి



మంగళగిరి: చేనేత నాయకులు చిన్నయ నాగభూషణం, అందె నరసింహారావు చేనేత పరిశ్రమ అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని పలువురు చేనేత సంఘం నాయకులు కొనియాడారు. మంగళవారం నాగభూషణం 14వ వర్ధంతి, నరసింహారావు 8వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసిన నాయకులు వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, పప్పు రాజారావు, రామనాథం పరమేశ్వరరావు,బల్ల వెంకటరమణ, అల్లక తాతారావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు పార్టీలు సహకరించాలి

తాడికొండ ఈఆర్‌ఓ గంగరాజు



రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ గంగరాజు

తాడికొండ: 2025 ఓటర్ల జాబితా సవరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణాధికారి ఎం.గంగరాజు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలు, అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 20వ తేదీ నుంచి అక్టోబర్ 18 వరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాపై సవరణలు, తొలగింపులు, కొత్త ఓటర్ల చేరిక, ఆధార్ అనుసంధానం, ఫొటోల సవరణలు, పోలింగ్ స్టేషన్‌ల మార్పు, పలు అంశాలపై పనిచేయనున్నారని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు వారిని సంప్రదించి ఓటర్ల జాబితా సవరణలో ఏమైనా అర్జీలు ఉంటే అందజేయడంతో పాటు అభ్యంతరాలను తమ దృష్టికి తీసుకొస్తే సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. వీటి కోసం ప్రత్యేక క్యాంపెయిన్ తేదీలను కూడా వెల్లడించి ప్రజలకు అందుబాటులో ఉంటారని వివరించారు. ఓటర్లు, రాజకీయ పార్టీలు సదావకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాడికొండ, మేడికొండూరు తహసీల్దార్లు నాసరయ్య, పద్మనాభుడు, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ మోహినీ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత

ఫిరంగిపురం: మండలంలోని మునగపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.

సూపర్ వైజర్ సునీత మాట్లాడుతూ బాల్యవివాహాల వలన కలిగే నష్టాలు, ఆరోగ్యపరమైన సమస్యలు గురించి వివరించారు. అంతేగాక బాల్యవివాహం చేసిన వారికి ప్రభుత్వం విధించే శిక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులతో బాల్యవివాహం నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచి వెంకటరత్నం, కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు, పి.శివకోటేశ్వరరావు, మహిళ పోలీసు గాయత్రీ, వీఆర్వో బ్రహ్మయ్య, హెచ్ఎం అంజలి, ఆరోగ్యమేరి, సుజాత పాల్గొన్నారు.

23న ఉపాధి హామీ పథకం గ్రామ సభలు

తాడికొండ: గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై చర్చించి ప్రతిపాదించేందుకు ఈ నెల 23న గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అత్తోట దీప్తి మంగళవారం విడుదల చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ గ్రామసభకు తాడికొండకు నోడల్ ఆఫీసర్లుగా ఎంపీడీఓ అత్తోట దీప్తి, నిడుముక్కలకు తహసీల్దార్ నాసరయ్య, లాం గ్రామానికి ఈఓపీఆర్డీ సిహెచ్.వెంకటేశ్వర్లు, పొన్నెకల్లు గృహ నిర్మాణ శాఖ ఏఈ ఐ.ఓబుల్ రెడ్డి, మోతడకకు పీఆర్ ఏఈఈ వై.శ్రీనివాస కుమార్, బేజాత్పురం విద్యుత్ ఏఈఈ వెంకట రవికుమార్, గరికపాడు వెలుగు సీసీ రాఘవ, రావెలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.శ్రీలత, పాములపాడుకు వెలుగు ఏపీఎం ఆర్.సాంబశివరావు, లచ్చన్నగుడిపూడికి సీహెచ్ నాగ శ్రీనివాస్, ఫణిదరంకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం.శ్రీదేవి, ముక్కామలకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్ కళావతి, కంతేరుకు ఏఎస్‌ఓ శ్రీధర్, బండారుపల్లికి ఎంఈఓ-1 టి.ఇందిర, దామరపల్లికి ఎంఈఓ-2 డి.ప్రభాకర్‌రావులను నియమించారు. వీరి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు గ్రామసభ నిర్వహించి చర్చించిన అంశాలపై తీర్మానం చేయనున్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



మంగళగిరి: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. పట్టణంలోని రత్నాల చెరువు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం గుడ్ షెఫర్డ్ కాన్వెంట్, బాలభవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల అక్రమ రవాణ, హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు నాగమణి, ఇశ్రాయిల్, బి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర జాతీయ నాణ్యత ప్రమాణాల హామీ పరిశీలన, తనిఖీ బృందం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలను, ప్రతి విభాగంలో ఉన్న సదుపాయాలకు వారికి వివరించారు. వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ప్రపంచ దోమల దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. దోమల ద్వారా వ్యాపించే జబ్బులను అరికట్టేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, ప్రజలకు ఆరోగ్యసేవలు అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

జాతీయ పోటీలకు ముగ్గురు పవర్‌లిఫ్టర్లు ఎంపిక



మంగళగిరి: కోల్‌కతాలో మంగళవారం నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న సీనియర్ నేషనల్ మెన్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి ముగ్గురు పవర్‌లిఫ్టర్లు ఎంపికయినట్లు అసోసియేషన్ ప్రతినిధులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని మంగళవారం తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో 57 కేజీల విభాగంలో షేక్ సాదియా ఆల్మాస్, 84 కేజీల విభాగంలో బొల్లినేని చంద్రిక, షేక్ షబ్బీనా ఎంపికయినట్లు తెలిపారు.

సమాజసేవలో భాగస్వాములు కావాలి

తాడికొండ: విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో భాగస్వాములు కావాలని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు అన్నారు. కళాశాల ఏఐ విభాగంలోని సిటీ టెక్నోసార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అనాథలు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రి, బస్టాండ్ పలు ప్రాంతాలలో ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమాజ సేవకు నడుం బిగించిన విద్యార్థులను కళాశాల అకడమిక్ డీన్ డాక్టర్ పి.ఫణికుమార్, ఏఐ హెచ్‌ఓడీ సుంకర శాంతి ప్రియ అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడికొండ: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తుళ్లూరులో చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. తుళ్లూరు ఎస్సీ కాలనీకి చెందిన బందారు ఏసురత్నం(37) భార్యతో మనస్పర్థలు ఏర్పడటంతో సోమవారం గ్రామ శివారు నీటి గుంతలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం మృతదేహం బయట పడటంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

డయల్ 100 ఫోన్ కాల్స్‌కు వెంటనే స్పందించాలి



నగరంపాలెం: డయల్ 100కు వచ్చే ఫోన్ కాల్స్‌కు సత్వరమే స్పందించి, పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవర ణలోని హాల్‌లో మంగళవారం పోలీస్ కంట్రోల్ రూం, క్లూస్ బృందం, ఫింగర్ ప్రింట్స్, హైవే పెట్రోలింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ డయల్ 100కు వచ్చే కాల్స్‌కు స్పందిస్తే బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. మహిళల భద్రత, రక్షణకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. వారి నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని అన్నారు. జిల్లాలోని ప్రజలు శుభ, ఇతరత్రా కార్యక్రమాలకు వెళ్లే ముందు తప్పనిసరిగా జిల్లా పోలీస్ కంట్రోల్ రూం 8688831568 నంబర్‌కు తెలియజేయాలని అన్నారు. తిరుగు ప్రయాణమై ఇళ్లకు వచ్చే వరకు లాక్డ్ హౌసింగ్ మోనిటరింగ్ సిస్టం(ఎల్‌ఎంహెచ్‌ఎస్)ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. తద్వారా ఇళ్లకు భద్రతగా ఉంటుందని అన్నారు.

జీజీహెచ్‌లో ఇక మోకీలు ఆపరేషన్లు

- ఉన్నతీ ఫౌండేషన్ సాయంతో ఉచితం
- గతంలో వంద మందికి చికిత్స
- తొలగిపోనున్న మోకీలు బాధితుల కష్టాలు



జీజీహెచ్‌లో ఉచితంగా ఆపరేషన్ చేయించుకున్న రోగులతో డాక్టర్ నరేంద్రరెడ్డి, డాక్టర్ ప్రశాంత్ (ఫైల్)

గుంటూరు మెడికల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల పెద్ద ఆస్పత్రిగా పేరుగడించిన గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి(జీజీహెచ్)లో మోకీలు మార్పిడి ఆపరేషన్లు ఉచితంగా చేసేందుకు రంగం సిద్ధమైంది. సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, ఉన్నతీ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ముందుకొచ్చారు. గతంలో వంద ఆపరేషన్లు జీజీహెచ్‌లో చేశారు. కరోనా నేపథ్యంలో ఆగిపోయిన ఆపరేషన్లు మళ్లీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చొరవతో ప్రారంభం కానున్నాయి. ఇటీవల జీజీహెచ్‌లో సమీక్ష చేసిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లకు ఉచిత మోకీలు మార్పిడి ఆపరేషన్‌ల గురించి డాక్టర్ కిరణ్‌కుమార్ వివరించారు. వారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆపరేషన్లు త్వరితగతిన ప్రారంభించి పేదలకు మోకీలు సమస్యలు తొలగించేలా ముగ్గురు వైద్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు.

2007 నుంచి ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు...

బీఎంఆర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, ఉన్నతీ ఫౌండేషన్‌ను 2007లో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ప్రారంభించారు. గుంటూరును జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జీలకు రాజధానిగా చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. గతంలో 20 ఆపరేషన్‌లకు ఉన్నతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా రూ.20 లక్షల ఖరీదు చేసే ఇన్‌ప్లాంట్లు అందించారు. ఇటీవల ఆఫ్రికా ఖండంలోని అంగోల దేశంలో అక్కడి దేశ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సీల్వియా పొలటుకుట ఆహ్వానం మేరకు వారం రోజులు పర్యటించి అక్కడి వైద్యులకు రివిజన్ రీప్లేస్‌మెంట్ సర్జరీల్లో శిక్షణ అందించారు. బంగ్లాదేశ్‌తో కూడా ఒప్పందం చేసుకుని వైద్యులకు జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీల్లో శిక్షణ అందిస్తున్నారు. రోబోటిక్ సర్జరీలను గుంటూరు ప్రజలకు చేరువ చేసి ఆధునిక వైద్య సేవలను మెట్రోపాలిటన్ నగరాలకు వెళ్లే పనిలేకుండా గుంటూరులోనే అందిస్తున్నారు.

పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలనే...



డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మైసూర్‌లో 1994లో ఎంబీబీఎస్, దావనగిరిలో 2003లో ఆర్థోపెడిక్ సర్జరీలో పీజీ పూర్తి చేశారు. హైదరాబాద్ సన్‌షైన్ హాస్పిటల్‌లో 2003–05 వరకు డాక్టర్ గురవారెడ్డి వద్ద తదపరి ఇంగ్లాండ్‌లో 2005లో జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. పుట్టి పెరిగిన జిల్లా నుంచి ప్రతిరోజూ అధిక సంఖ్యలో వ్యయప్రయాసలతో మోకీలు మార్పిడి ఆపరేషన్ల కోసం వస్తున్న విషయాన్ని గమనించారు. దీంతో గుంటూరులో సాయిభాస్కర్ హాస్పిటల్ ఏర్పాటు చేశారు. హాస్పిటల్ ఏర్పాటు చేసిన మొదట్లో ప్రజలకు జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్లు అంటే చాలా భయంతో పాటుగా పలు అనుమానాలు ఉండేవి. వాటిని తొలగించేందుకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

డాక్టర్ నరేంద్రరెడ్డిసేవలు అభినందనీయం...



మోకీలు నొప్పులు, కీళ్ల అరుగుదల లాంటి సమస్యలతో జీజీహెచ్‌కు వచ్చే పేద ప్రజలకు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ఉచితంగా ఆపరేషన్లు చేయటం అభినందనీయం. ఆపరేషన్లు ఉచితంగా చేయటంతో పాటుగా సుమారు రూ.20 లక్షల ఖరీదు చేసే ఇంప్లాంట్‌లను ఆయనే తన ట్రస్ట్ ద్వారా పేదలకు ఉచితంగా ఇచ్చారు. ప్రభుత్వం మోకీలు మార్పిడి ఆపరేషన్లు తిరిగి ప్రారంభించేందుకు సిద్ధం అయ్యాం. త్వరలోనే ఉచిత ఆపరేషన్లు ప్రారంభమవుతాయి.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్.

ఎకో పార్కును సందర్శించిన అధికారులు



టెంపుల్ హిల్ ఎకో పార్కును పరిశీలిస్తున్న అధికారులు

మంగళగిరి: పట్టణంలోని ఎయిమ్స్ వద్ద టెంపుల్ హిల్ ఎకో పార్కును మంగళవారం శిక్షణలో ఉన్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు సందర్శించారు. రాజమండ్రి అకాడమిలో శిక్షణ పొందిన అధికారులు ఎకో పార్కును క్షేత్ర స్థాయిలో సందర్శించి ట్రెక్కింగ్‌లో పాల్గొన్నారు.